# ఎన్నికల బరిలో 92మంది




విలేకరుల సమావేశంలో నామినేషన్ వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- పోటీలో అత్యధికంగా కోదాడలో 34 మంది
- అతి తక్కువగా తుంగతుర్తిలో 14 మంది
- ఇక మరింత హోరెత్తనున్న ప్రచారం
- సూర్యాపేటలో పటేల్ రమేశ్‌రెడ్డి ఉపసంహరణ రచ్చరచ్చ

సూర్యాపేట, నవంబర్ 15 : నామినేషన్ల ఉపసంహరణ అనంతరం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో 92 మంది అభ్యర్థులు నిలిచారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నియోజక వర్గాల్లో 154 మంది అభ్యర్థులు 265 నామినేషన్లు వేశారని చెప్పారు. నామినేషన్ల పరిశీలనలో 30 మంది అభ్యర్థులు తిరస్కరణకు గురి కాగా 124 మంది బరిలో నిలిచారని చెప్పారు. ఉప సంహరణలో భాగంగా 32 మంది అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకోగా మొత్తం 92 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని తెలిపారు. వీరిలో హుజూర్‌నగర్-24, కోదాడ 34, సూర్యాపేట -20, తుంగతుర్తి -14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గాల్లో 2 బ్యాలెట్ యునిట్లు, కోదాడ 3, సూర్యాపేట 2, తుంగతుర్తి 1 చొప్పున బ్యాలెట్ యునిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. బుధవారం రాత్రి వరకు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని చెప్పారు. ప్రచారంలో అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. గురువారం నుంచి ప్రతి రోజు ఎన్నికల ఖర్చు వివరాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. 12డీ ఫామ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,008 మంది వికలాంగులు, వృద్ధులు దరఖాస్తులు చేసుకున్నారని వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉంటుందన్నారు. సెక్టోరియల్ అధికారి వారి ఇంటికి వచ్చి ఓటు వేయించనున్నట్లు చెప్పారు. దవాఖానకు వెళ్లే మరో రోజు ఓటింగ్ కోసం వస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఓటర్ స్లిప్‌లు పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకొని వచ్చి ఓటు వేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఓపీఓ, ఏపీఓలకు ఇప్పటికే మొదటి విడుత శిక్షణ పూర్తయినందున ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. ప్రతి ఉద్యోగి రెండో విడుత శిక్షణకు తప్పక హాజరుకావాలన్నారు. ఈనెల 22,23 పీఓ, ఓపీఓలకు, 24న ఏపీఓలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కేంద్రాల వద్దనే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాలన్నారు.

### సూర్యాపేట బరిలో 20 మంది అభ్యర్థులు

సూర్యాపేట : శాసనసభ ఎన్నికలకు నామినేషన్ల స్క్రూటిని, ఉపసంహరణల పర్వం ముగిసింది. ఈనెల 3 నుంచి 10 వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణలో సూర్యాపేట నియోజకవర్గానికి 42 మంది అభ్యర్థులు 81 సెట్ల నామినేషన్లు వేశారు. 23 మంది అభ్యర్థులు స్వతంత్రులు నామినేషన్ వేశారు. 13న నామినేషన్ల పరిశీలన ఉండగా 10 మంది అభ్యర్థుల నామినేషన్లు స్క్రూటినీలో తిరస్కరించారు. 15న ఉపసంహరణ గడువు ఉండగా 12 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దాంతో సూర్యాపేట నియోజక వర్గ బరిలో 20 మంది అభ్యర్థులు నిలిచారు. గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు నాలుగు ఉండగా రిజిస్టరు చేసిన రాజకీయ పార్టీలు 7 ఉన్నాయి. 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. ప్రధాన పార్టీలకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించి ఉండగా రిజిష్టర్ పార్టీలకు స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు.

### రెండు ఈవీఎం బాక్సులు

ఎన్నికల పోలింగ్ కోసం ఎన్నికల సంఘం ఈవీఎం మిషన్ ఉపయోగించనున్నది. ఒక ఈవీఎం బాక్స్‌పై 16 గుర్తుల వరకు ఉంటాయి. అంటే 15 మంది అభ్యర్థులు ఒకటి నోటా సింబల్ వరకు కేటాయించవచ్చును. ఈ సారి సూర్యాపేట అసెంబ్లీ బరిలో 20 మంది అభ్యర్థులు పోటీ పడుతుండడంతో రెండు ఈవీఎంలు వినియోగించాల్సి ఉంటుంది. దాంతో మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థులు రెండో ఈవీఎంలో 4 అభ్యర్థులతో పాటు నోటా గుర్తు కేటాయించే అవకాశం ఉంది.

### సూర్యాపేట నియోజవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు

| క్ర.సం | అభ్యర్థి | పార్టీ |
|---|---|---|
| 1 | గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి | బీఆర్ఎస్ |
| 2 | రాంరెడ్డి దామోదర్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 3 | వట్టె జానయ్య | బీఎస్పీ |
| 4 | సంకినేని వెంకటేశ్వర‌రావు | బీజేపీ |
| 5 | చెరుకు కిరణ్‌కుమార్ | డీఎస్పీ |
| 6 | కిరణ్ వంగపల్లి | రిపబ్లికన్ సేన |
| 7 | తరాల ఆంజనేయులు | జన శంఖారావం పార్టీ |
| 8 | పలేటి రమేశ్ | బహుజన ముక్తి పార్టీ |
| 9 | వరికుప్పల వెంకన్న | యం సీపీఐ(యూ) |
| 10 | లింగిడి వెంకటేశ్వర్లు | ప్రజావాణి |
| 11 | శలోజ రాజశేఖర్ | యుగ తులసి |

వీరితో పాటు మరో తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు.

### తప్పుడు పోస్టులు పెడితే కేసులు
### ఎస్పీ రాహుల్ హెగ్డే

ఎన్నికల సమయంలో సోషల్ మీడియాపై నిఘా పెట్టామని తప్పుడు పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,942 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎలాంటి ఫిర్యాదులు చేయాలన్నా సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలకు ఎన్నికల విధుల కోసం జిల్లాకు మరి కొన్ని కేంద్ర బలగాలు అసవరమని చెప్పారు. సమస్యాత్మకగా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి వాటిని నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి సతీశ్‌కుమార్, డీపీఆర్వో రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

# సూర్యాపేట కాంగ్రెస్‌లో రభస

- మల్లు రవి, పటేల్ రమేశ్‌రెడ్డి వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం
- తోపులాటతో ఉద్రిక్త పరిస్థితి
- నామినేషన్ ఉపసంహరణతో పటేల్, కాంగ్రెస్‌పై ఆగ్రహం
- బలవంతపు ఉపసంహరణతో మళ్లీ విలపించిన రమేశ్‌రెడ్డి
- ప్రత్యామ్నాయ పార్టీల్లో చేరి తమ సత్తా చూపిస్తామన్న నాయకులు, కార్యకర్తలు

సూర్యాపేట, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో పటేల్ రమేశ్‌రెడ్డి నామినేషన్‌ను ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకులు రావడం.. ప్రతిగా పటేల్ అనుచరులు వ్యతిరేకించడంతో దాదాపు మూడు గంటల పాటు హైడ్రామా మధ్యన రసాభాసా సాగింది. పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందంటూ కోపంతో ఉన్న ఆయన వర్గీయులు ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఆవేదనతో ఉన్న వారిని సముదాయించాల్సిందిపోయి మల్లురవి కార్యకర్తలపై ఆగ్రహంతో ఊగిపోయి దూషించారు. గుండాయిజానికి దిగి కాలర్ పట్టుకుని లాగి దాడికి పాల్పడ్డారు. అసలే టికెట్ విషయంలో కాంగ్రెస్ తమను మోసం చేసిందనే కోపంతో ఉన్న కార్యకర్తలు మల్లు రవిపై దాడికి దిగి నితకబూదారు. మళ్లీ మాయమాటలు చెప్పి 2018 మాదిరిగానే ఈసారి కూడా రమేశ్‌రెడ్డిచే నామినేషన్‌ను బలవంతంగా ఉపసంహరింపజేయగా ఆయన బోరున విలపించాడు. కాంగ్రెస్ మోసం చేస్తుందనేది తెలిసినప్పటికీ ఉపసంహరించుకోవడం ఎందుకు.. బాధ పడడం ఎందుకు అంటూ పలువురు రమేశ్‌రెడ్డిపై సైతం మాటల దాడికి దిగాడు. తాము ప్రత్యామ్నాయ పార్టీల్లో చేరి తమ సత్తా ఏంటో చూపిస్తామంటూ అక్కడినుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

### రమేశ్‌రెడ్డికి మళ్లీ భంగపాటు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం టికెట్ ఆశించి భంగపడ్డ పటేల్ రమేశ్‌రెడ్డికి ఈ ఎన్నికల్లోనూ భంగపాటు తప్పలేదు. దాంతో జనబలం ఉన్న తాను కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుని ఈ ఎన్నికల్లో ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ బ్లాక్ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. ఆ పార్టీ సింహం గుర్తుపై ప్రచారం చేస్తూ వస్తున్నారు. అయితే బుధవారం నామినేషన్ విత్‌డ్రాకు చివరి గడువు కావడంతో ఢిల్లీ నుంచి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ ఎంపీ మల్లు రవి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి పటేల్ రమేశ్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. వారు వస్తారని ముందుగానే ఊహించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రమేశ్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని వచ్చారని కాంగ్రెస్ పెద్దలను నిలదీశారు. స్వల్ప తోపులాటల నడుమనే వారు రమేశ్‌రెడ్డి నివాసంలోకి చేరుకున్నారు. శాంతించని కార్యకర్తలు రమేశ్‌రెడ్డి ఇంటి కిటికీ అద్దాలను రాళ్లతో పగలగొట్టారు. ఐదు గంటల సుదీర్ఘ చర్చల అనంతరం రమేశ్‌రెడ్డి మాత్రం బోరున విలపిస్తూ బయటకు వచ్చి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు పోతు భాస్కర్ వాహనంలో నామినేషన్‌ను విత్‌డ్రా చేసేందుకు రమేశ్‌రెడ్డిని తీసుకెళ్తున్న సమయంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త నెలకొన్నది. పోలీసులు కలుగజేసుకుని ఏఐసీసీ పెద్దలను పక్కకు తీసుకెళ్లారు.

### ఊళ్లో మొహం ఎలా చూపించాలంటూ..

సూర్యాపేట నియోజక వర్గంలో రెండు వర్గాలుగా పని చేస్తున్న కాంగ్రెస్ నాయకుల్లో కొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పటేల్ రమేశ్‌రెడ్డి వెంట ఏడేండ్లుగా పని చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా రమేశ్‌రెడ్డికి టికెట్ వస్తుంది, గెలుస్తాడని ధీమాతో ఉన్న నాయకులు, కార్యకర్తలు రమేశ్‌రెడ్డి చేసిన పనిని జీర్ణించుకోలేకపోతున్నారు. రమేశ్‌రెడ్డి సరెండర్ కావడంతో తమకు దిక్కు ఎవరూ.. తాము ఊర్లో ఎలా మొఖం చూపించుకోగలమంటూ నిరసన నినాదాలు చేస్తూ రమేశ్‌రెడ్డిని ప్రశ్నించారు. తనకు ఇదే చివరి ఎన్నిక అని.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని 2018లో దామోదర్‌రెడ్డి బాండ్ పేపర్ రాసి ఇచ్చారని, అలాగే పార్టీ అధిష్ఠానం కూడా 2023 టిక్కెట్ పటేల్‌కే అని చెప్పి రెండోసారి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుడు, మోకాళ్ల ఆపరేషన్ చేయించుకుని నడవలేని దామోదర్‌రెడ్డి ఎలా గెలుస్తాడన్నారు. పార్లమెంట్ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పే మాయ మాటలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. తప్పకుండా మరోమారు ద్రోహం చేయడం ఖాయమని ఇక రమేశ్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ శూన్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచే వారికి కాకుండా జోకే వారికి టిక్కెట్లు వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మాత్రం రమేశ్‌రెడ్డి వెంట కాంగ్రెస్‌లో ఎట్టి పరిస్థితుల్లో ఉండబోమని ప్రత్యామ్నాయ పార్టీల్లో చేరి తమ సత్తా ఏమిటో చూపిస్తామంటూ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

# చెక్ పోస్టుల్లో నిరంతర నిఘా

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 15 : ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అన్ని చెక్ పోస్టుల్లో నిఘా 24 గంటలు ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభ్యర్థుల ప్రచారాలపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాలోని బ్యాంక్‌ల్లో జరిగే లావాదేవీలు, డిజిటల్ లావాదేవీలపై నిఘా ఉంచి రోజువారి వివరాలను అందించాలని సూచించారు. వాహనాల తనిఖీలో ఇప్పటి వరకు 162 కేసులు నమోదైనట్లు చెప్పారు. రూ.4,55,48,786 విలువ గల నగదు, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 568 కేసులు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. 282 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. రూ. 3,40,46,665 విలువ గల అక్రమ మద్యం 52,425 లీటర్లు పట్టుకున్నట్లు అలాగే 33 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, ఆర్ఎం ఎస్‌బీఐ జ్యోతి, డీఎఫ్ఓ సతీశ్ కుమార్, ఎల్‌డీఎం బాపూజీ, సీటీఓ యాదగిరి, డీసీఓ శ్రీధర్, ఏఓ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### తొండ పోలింగ్ కేంద్రం పరిశీలన

తిరుమలగిరి : మండల పరిధిలోని తొండ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ పరిశీలించారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ రమణారెడ్డి, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

# మాదిగల మద్దతు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కే

- టీఎమ్మార్పీఎస్ నాగారం మండలాధ్యక్షుడు రాఘవులు

నాగారం, నవంబర్ 15 : త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నాగారం మండల మాదిగలంతా బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు వంద శాతం మద్దతుగా ఉంటారని టీఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దందోలు రాఘవులు తెలిపారు. బుధవారం నాగారం బంగ్లాలో టీఎమ్మార్పీఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏండ్లు తన స్వార్థం కోసం తిరిగి ఇప్పుడు మాదిగల మద్దతు కోసం వచ్చిన మందుల సామేలు మాదిగల ద్రోహి అన్నారు. మాదిగ సోదరులను నాయకులుగా తీర్చిదిద్దిన గాదరి కిశోర్‌కుమార్‌కే తామ మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. మాదిగల పేరుతో ఇప్పుడు వస్తున్న మందుల సామేలును మాదిగలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. సమావేశంలో పడిశాల పెద్ద వీరయ్య, లింగయ్య, రుషిపాక మైసయ్య, దర్శనాల శేఖర్, వడ్డే గణేశ్, మహేశ్, వెంకన్న పాల్గొన్నారు.